క్లుప్తంగా

బాధితుడికి బ్యాగు అప్పగింత



కాజీపేట: విలువైన కాగితాలు, నూతన వస్త్రాలు గల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోగా బాధితుడికి కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మాచర్ల శ్వేత శుక్రవారం సాయంత్రం అందించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చంద్రమణి అనే యువకుడు కాజీపేట చౌరస్తాలో ఆటో ఎక్కి సుబేదారిలో దిగిపోయాడు. ఆటోలోనే బ్యాగ్ మరిచిపోయినట్లుగా గుర్తించిన ఆటో డ్రైవర్ రహీం.. యూనియన్ నాయకుల సహకారంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. బాధితుడు చంద్రమణిని కాజీపేట పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బ్యాగును పోలీసులు అందించారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, యూనియన్ అధ్యక్షుడు దార సూరి, భాస్కర్ పాల్గొన్నారు.

అండగా 'తాడి కార్పొరేషన్'



హసన్‌పర్తి: గీత కార్మికులకు తాడి కార్పొరేషన్ అండగా నిలుస్తోందని సర్వాయి పాపన్న గౌడ్ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ శ్రీపతి గోపిగౌడ్ అన్నారు. ఇటీవల తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద జారిపడిన హసన్‌పర్తి మండలం సిద్దాపురానికి చెందిన గోపగాని సాంబయ్యగౌడ్‌కు తాడి కార్పొరేషన్ ద్వారా విడుదలైన రూ.15 వేల విలువగల చెక్కును బాధితుడికి శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జనగాం ధనలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ కిరణ్, సర్వాయి పాపన్న సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రమేష్‌గౌడ్, నాయకులు జనగాం సుదర్శన్‌గౌడ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



కేయూ క్యాంపస్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు పాఠశాలల విద్యార్థులకు కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 27న జరగనున్న కార్యక్రమంలో వీసీ రమేష్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న తెలిపారు. కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, మైక్రో బయాలజీ విభాగం అధిపతి డాక్టర్ శ్రీనివాస్ ముంజం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భారీ పడవ



కాజీపేట: కాజీపేట మీదుగా లారీలో ఓ భారీ పడవను శుక్రవారం తీసుకెళ్తుండడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. లారీపై పడవను హైదరాబాద్ వైపు తీసుకెళ్లారు. పడవ పెద్దగా ఉండడంతో రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు అడ్డం వస్తుండడంతో సిబ్బంది వాటిని తొలగిస్తూ ముందుకు సాగారు. ఈక్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఘనంగా ప్రింటర్స్ డే

కాజీపేట: ముద్రణ యంత్రాన్ని కనుగొన్న జోహెన్ గుటన్‌బర్గ్ జయంతిని పురస్కరించుకుని కాజీపేట పట్టణంలో ప్రింటర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో బర్గ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మునిగాల ప్రవీణ్ కేక్ కట్ చేసి సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.వీరస్వామి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వయంకృషి వృద్ధాశ్రమంలో అన్నదానం



కేక్ కట్ చేస్తున్న ప్రింటర్స్ సొసైటీ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: అంతర్జాతీయ ప్రింటర్స్ డేను పురస్కరించుకుని యునిటీ ప్రింటర్స్ సొసైటీ హనుమకొండ ఆధ్వర్యంలో పెద్దమ్మగడ్డ శివారులోని స్వయంకృషి ఆశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ భరద్వాజ్ మాట్లాడుతూ అక్షరాలకు రూపం సమకూర్చే తమ వృత్తిని గౌరవిస్తూ, జిల్లావ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పోలంపెల్లి మహేశ్వర్, కోశాధికారి గుండా ప్రవీణ్‌కుమార్, సభ్యులు సీహెచ్.ఎల్లారెడ్డి, ఉపేందర్, పాకిడే రాజేష్, రమేష్, రాజేశం పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు



నిరసన తెలుపుతున్న ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని గోర్ సేన, గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బాలాజీ నాయక్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్లు జవహర్, ఉషన్, కేయూ జేఏసీ నేతలు వినోద్ లోక్‌నాయక్, తిరుపతి, బీజేపీ మోర్చా నాను నాయక్, అజ్మీరా వెంకట్, ఫణి, సేవాలాల్ సేన అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో..

డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సైఫ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి కేఎంసీ ప్రిన్సిపాల్, హెచ్ఓడీ, ఎంజీఎం సూపరింటెండెంట్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని దళిత, గిరిజన సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు కిషన్, జన్ను భాస్కర్, కన్నం సునీల్, కొమురం రామ్మూర్తి, బాలాజీ నాయక్, మురళినాయక్, ఉడే సింగ్ నాయక్, వసంత్‌నాయక్ పాల్గొన్నారు.

హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్‌లో..

హన్మకొండ: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోతు వీరన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుక్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి మాట్లాడారు.

ప్రీతికి మెరుగైన వైద్యం అందించాలి

ఖిలా వరంగల్: వైద్య విద్యార్థిపై ర్యాగింగ్ పాల్పడిన వ్యక్తిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలు ప్రీతికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు అండర్ బ్రిడ్జ్ బస్టాప్ వద్ద ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

ఎంజీఎం: డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని గిరిజన సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ ఘటనకు కారణమైన వారిని విధుల్లో నుంచి తొలగించాలని సూచించారు. మంద కుమార్‌మాదిగ, బాదావత్ రాజు, కన్నం సునీల్, కొమురం రామ్మూర్తి, బాదావత్ బాలాజీ నాయక్, సేవలాల్ సేన, మురళీనాయక్, ఉదయ్ సింగ్ నాయక్ పాల్గొన్నారు.

పరిశోధనలపై అవగాహన అవసరం



ప్రొఫెసర్ దినకర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

హన్మకొండ అర్బన్: మానవాళికి సైన్స్ అనేక రకాలుగా ఉపయోగపడుతోందని, ఈక్రమంలో సైన్స్‌లో పరిశోధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి సూచించారు. జాతీయ సైన్స్ వారోత్సవాల్లో భాగంగా భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెటీరియల్ సైన్స్, మెడికల్ ఇంప్లాంట్స్ అనే అంశంపై కళాశాలలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ దినకర్ మాట్లాడుతూ వైద్యరంగం, మానవ శరీరంలో ఉపయోగించే ఇంప్లాంట్స్ తయారీ, వాడకంలో మెటీరియల్ సైన్స్ పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి సీహెచ్.స్నేహలతారెడ్డి, డాక్టర్ బాపూజీ వాగేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, రేణుక, పార్వతి, శిరీష, అరుణ, సావిత్రి, మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి



మ్యాథ్స్ గైడ్‌లతో విద్యార్థులు

కరీమాబాద్: ప్రతీ విద్యార్థి గణితశాస్త్రంపై పట్టు సాధించాలని రీజనల్ సైన్స్ సెంటర్ అధికారి వి.వెంకటేశ్వర్‌రావు సూచించారు. నేషనల్ మేథమెటిక్స్ డే ఉత్సవాల్లో భాగంగా కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్రంపై శుక్రవారం వ్యాసరచన, డ్రాయింగ్, మ్యాథ్స్ మోడల్స్‌పై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితశాస్త్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. విద్యార్థులు గణితంపై పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. జాతీయ స్థాయిలో నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఉపాధ్యాయురాలు కొటం ధనలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ డి.రవి, ఉపాధ్యాయులు భార్గవి, రాజ్యలక్ష్మి, శేషాచారి, అభినవ్, రాజయ్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ ప్రకటించాలని నిరసన



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

హన్మకొండ: తమకు పీఆర్సీ ప్రకటించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పవర్ జేఏసీ ఎన్పీడీసీఎల్ శాఖ నాయకుడు ఎ.ఆనందం మాట్లాడుతూ విద్యుత్ సంస్థల యజమాన్యాలు పీఆర్సీ ప్రకటించడంలో జాప్యం చేస్తున్నట్లు చెప్పారు. పీఆర్సీ ప్రకటించే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు రంగారావు, రమణారెడ్డి, అజ్మీర శ్రీరాంనాయక్ పాల్గొన్నారు.

నగరంలో నేడు.. రేపు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున హనుమకొండలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

'తూర్పు'లో ఎమ్మెల్యే ఈటల పర్యటన

కరీమాబాద్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ నియోజకవర్గ పాలక్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ శనివారం పర్యటించనున్నారు. 41వ డివిజన్ ఎస్సీ కాలనీ, నాగమయ్య టెంపుల్, 38వ డివిజన్ ఖిలా వరంగల్ పడమరకోట, చమన్ ప్రాంతాల్లో నిర్వహించే శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌లలో పాల్గొంటారని పార్టీ నాయకులు తెలిపారు.

రేపు ధార్మిక సదస్సు

న్యూశాయంపేట: శంభునిపేటలో జాల్సా - ఏ - అజ్మతే - సాదాయేక్రమ్ (ధార్మిక సదస్సు)ను ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ మహ్మద్ ముషైద్ తహిశీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శ్రీరాఘవేంద్ర జన్మదిన మహోత్సవం

హన్మకొండ: హనుమకొండ పరిమలకాలనీలోని రాఘవేంద్రస్వామి మఠంలో ఈనెల 26న రాఘవేంద్రస్వామి జన్మదిన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మఠం వ్యవస్థాపకుడు బి.రమామణి కృష్ణమూర్తి, మఠం మేనేజర్ డీవీఎం.ప్రభాకర్ తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు బీసీల ఆత్మీయ అభినందన సభ



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం మైదానంలో ఈనెల 26న జరగబోయే బీసీల ఆత్మీయ అభినందన సభను విజయవంతం చేయాలని కేయూ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం నిర్వహించిన బీసీ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన బైరి రవికృష్ణ, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కల్కచర్ల శ్రీనివాస్‌కు ఈనెల 26న బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు బుర్ర ప్రవీణ్, ఉపాధ్యక్షుడు లింగరాజు, నర్సింహ, విజయ్, వెంకటేష్, ప్రభాకర్, శ్రీనివాస్, సంగిలాల్ పాల్గొన్నారు.

కేయూలో సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో సీఐటీయూ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రెండోరోజు శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగింది. మహిళా హాస్టల్, కామన్ మెస్ ప్రాంతాల్లో దినసరి వేతన, క్యాజువల్, లంప్సమ్ ఉద్యోగులు సంతకాలు చేశారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల దినసరి వేతన, క్యాజువల్, లంప్సమ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి మాట్లాడారు. కేయూ సీఐటీయూ అధ్యక్షుడు రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేశిని రవికుమార్, బాధ్యులు పల్లం రాజు, మధు, గాజరాజు, నయీమ్, వినోద్, యాకూబ్ పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి దివ్యాంగురాలి అప్పగింత



కాజీపేట: రహదారి పక్కన దీనస్థితిలో తిండితిప్పలు లేక పడిఉన్న ఓ దివ్యాంగురాలిని సామాజిక కార్యకర్త చందు చేరదీసి అనాథ ఆశ్రమంలో చేర్పించిన ఘటన శుక్రవారం హనుమకొండ పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమీపంలో జరిగింది. దర్గా కాజీపేట పట్టణానికి చెందిన చందు తన కారులో హనుమకొండకు వెళ్తుండగా రహదారి పక్కన పడిఉన్న యువతి వివరాలు తెలుసుకున్నారు. తను విజయవాడ నుంచి రైల్‌లో వచ్చానని, తనకు బంధువులు ఎవరూ లేరని ఆమె తెలిపింది. ఈ విషయాన్ని హనుమకొండ ఎస్సై బి.రాజు దృష్టికి చందు తీసుకెళ్లి సహాయం చేయాలని అర్థించగా, దివ్యాంగురాలిని ఆశ్రమంలో చేర్పించడానికి అవసరమైన కాగితాలను తయారు చేసి ఇచ్చారు. ఏఎస్సై లక్ష్మి సహకారంతో వరంగల్ అనాథాశ్రమంలో దివ్యాంగురాలిని చేర్పించారు.

వైభవంగా శివపార్వతుల రథోత్సవం



ఊరేగింపులో సందడి చేస్తున్న కళాకారులు

మడికొండ: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా మెట్టు రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక రథంలో వైభవంగా రథోత్సవం నిర్వహించారు. మడికొండలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నీళ్ల బిందెలతో రథానికి ఎదురేగి నీళ్లు ఆరపోస్తూ మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ, స్వామివారి ఆశీర్వచనాలు పొందారు. రథోత్సవంలో భాగంగా కోలాటం, గొల్లడప్పులు, భజన బృందాలు, చిరుతల రామాయణం, నృత్యాల మధ్య రథం ముందుకు సాగింది. వేడుకల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరశురాం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, మునిగాల సరోజన, ఆవాల రాధికరెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ దువ్వ నవీన్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



బహుమతి అందజేస్తున్న హెచ్ఎం సంధ్యారాణి

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని మండల పరిషత్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి వారికి పాఠ్యాంశాలను బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత లెక్చరర్ భూక్య పూల్యానాయక్, ఉన్నత పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి, మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి, స్థానికులు పెండ్లి కృష్ణమూర్తి, మాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పంటలకు బీమా చేయించాలి

హసన్‌పర్తి: పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని రైతు సంఘాల సమాఖ్య సభ్యులు కోరారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు పంటలకు మద్దతు ధర ప్రకటించాలని పేర్కొన్నారు. పనికి ఆహార పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల సమాఖ్య జిల్లా కోఆర్డినేటర్ తోకల ఆదిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంహెచ్ఓకు అభినందనలు



వరంగల్ అర్బన్: బల్దియా సీఎంహెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రాజేష్‌ను బల్దియా ప్రధాన కార్యాలయంలో పలు సంఘాల నాయకులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను భాస్కర్, సమాచారం హక్కు అవగాహన సమితి అధ్యక్షుడు కొంగర వరుణ్, అరె కటిక సంఘం నాయకులు రఘు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం సీఏ బ్రాంచ్ మార్పు

వరంగల్ చౌరస్తా: సీఏ విద్యార్థులకు సకల ఆధునిక వసతుల కల్పించడం కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్‌ను వేరే చోటుకు మార్చినట్లు చైర్మన్, సీఏ ప్రదీప్‌చంద్ర తెలిపారు. హంటర్‌రోడ్డు సాయినగర్‌లోని నూతన బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావారణలో బిడ్డింగ్, సెమినార్ హాల్, రీడింగ్ రూమ్, లైబ్రరీ, క్లాస్ రూమ్, ల్యాబ్ సౌకర్యాలను కొత్త భవనంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి భగవన్ దాస్, వైస్ చైర్మన్ హరికృష్ణ, కోశాధికారి సత్యనారాయణ, సీనియర్ సీఏ త్రిపురనేని గోపిచంద్, ఎస్ఐసీఏఎస్ఏ చైర్మన్ ఎం.సుజాత, సభ్యులు రామకృష్ణ, మాణిక్య ప్రసాద్, దేవసాయం, రాజేంద్ర కుమార్, టి.కృష్ణకుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్వచ్ఛంద సంస్థ చేయూత



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్, ఉపాధ్యాయులు

కాశిబుగ్గ: కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి) అభివృద్ధికి బెస్ట్ రన్నర్స్ స్వచ్ఛంద సంస్థ ఎప్పుడూ ముందుంటుందని సంస్థ సభ్యుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ముక్కా శ్రీనివాస్ తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో రూ.70 వేల ఆర్థిక సహకారంతో పాఠశాలలో అభివృద్ధి చేసిన మూడు తరగతి గదులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ రాష్ట్రంలోని పలు పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కుంట రవికుమార్, కుమారస్వామి, వీరేశలింగం, అజయ్‌బాబు, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

గాడిపెల్లిలో కంటి వెలుగు శిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ గాడిపెల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు హాజరై బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కత్తెరపల్లి దామోదర్‌తో కలిసి శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ సుష్మ, జీఎస్ఎం ఎ.వసంత, కుమారస్వామి, పసునూరి వీరస్వామి, ఎస్ఎంఎస్ చైర్మన్ భాస్కర్, సదానందం, రమేష్, యాదగిరి, సాంబయ్య, మొండయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చావుకు కారణమైన వారిపై చర్య తీసుకోవాలి

రామన్నపేట: సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఖాదీర్‌ఖాన్ చావుకు కారణమైన పోలీసులపై చర్య తీసుకోవాలని బీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ గోపాలస్వామి గుడి సమీపంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాదీర్‌ఖాన్ చావుకు కారణమైన పోలీసు అధికారులను సస్పెండ్ చేసినంత మాత్రాన న్యాయం జరిగినట్టు కాదని, కేసు నమోదు చేసి శిక్ష విధించాలని సూచించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ కడిపికొండ క్రాస్‌రోడ్డులో టీవీఎస్ ఎక్సెల్‌ను మున్సిపల్ డీసీఎం వ్యాన్ శుక్రవారం ఢీకొట్టింది. దాంతో ద్విచక్రవాహనంపై ఉన్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మడికొండ వైపు నుంచి కాజీపేటకు వస్తున్న సుధాకర్ దంపతులను వ్యాన్ ఢీకొట్టడంతో వారు కిందపడడంతో మహిళకు తీవ్ర గాయాలు కాగా, 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వ్యాన్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న పూజారులు

హసన్‌పర్తి: 66వ డివిజన్ హసన్‌పర్తి ఆర్టీసీ కాలనీలోని రామాలయంలో సీతా లక్ష్మణ సమేత రామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని చివరి రోజు హోమం, మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం జరిపించారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు హాజరై పూజలు చేశారు.

క్రైం కార్నర్

బాలసముద్రంలో చైన్ స్నాచింగ్

కాజీపేట: కాలినడకన నడిచి వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఘటన బాలసముద్రం ఏకశిల పార్కు వద్ద శుక్రవారం జరిగింది. ఓ ప్రైవేట్ ఉద్యోగి నడుచుకుంటూ కార్యాలయానికి వెళ్తుండగా స్కూటీపై గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న అర్థ తులం బంగారపు చైన్‌ను తెంపుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బైక్ నడుపుతూ పట్టుబడిన నలుగురు బాలలు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన నలుగురు బాలురపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జువైనల్ మేజిస్ట్రేట్ వారిని 2 రోజుల పాటు అబ్జర్వేషన్ గృహానికి పంపించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి.రవికుమార్ తెలిపారు. పట్టుబడిన నలుగురిపై చార్జ్‌షీట్ వేయడంతో పాటు పిల్లలకు వాహనాలు ఇచ్చిన యజమానులకు జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కాజీపేట: కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్ కాలనీలో ఓ ఇంట్లో రహస్యంగా కొంతమంది పేకాట ఆడుతున్నట్లుగా అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, నాసిర్‌పాషా, మాచర్ల శ్వేతతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నిక



నియామక పత్రం అందిస్తున్న వెంకట్

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా సుంచు రఘురాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సుంచు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సుంచు అశోక్ కుమార్, డైరెక్టర్లుగా పెసరు రాజేశ్వర్, రావుల గురుమూర్తి, రావుల రమేష్, సుంచు భిక్షపతి, సుంచు రామ్మూర్తి, సుంచు లక్ష్మినారాయణ ఎన్నికయ్యారు. వారికి ఎన్నికల అధికారి వెంకట్ నియామక పత్రాలు అందజేశారు.